# వారఫలం

"వారం మొత్తం మీద బాగానే ఉంటుంది. పై అధికారుల ప్రీతికి పాత్రులు కావచ్చు. ప్రయాణాల వల్ల లాభం కలుగుతుంది. పుణ్యక్షేత్ర దర్శనయోగం కలగవచ్చు. కుటుంబ జీవితంలో చిన్నచిన్న విభేదాలు కానీ, కలహాలు కానీ రావచ్చు. శరీరానికి గాయాలు కానీ, మానహాని కానీ కలగకుండా చూసుకోవాలి."

ఆదివారం శెలవురోజు కాబట్టి, కాళ్ళు జాపుకుని తీరిగ్గా పడుకుని, రెండు న్యూస్‌పేపర్లు తల నుంచి తోకదాకా......అంటే తాటికాయంత అక్షరాలతో ముద్రించబడిన సదరు పేపరు పేరు నుంచీ అవగింజంత సైజు అక్షరాలతో చివరిపేజీలో ముద్రించిన ఎడిటరూ, పబ్లిషర్ల పేర్లతో సహా చదివే శీలం గల ఒక వ్యక్తే సుశీల్‌రావు.

అతనికి వారఫలంలో మొదటి సగం నచ్చింది. మొత్తం మీద వారమంతా బాగనే ఉంటుందని కదా అందులో రాశాడు. కంపెనీ హెడ్‌క్వార్టర్స్ అయిన మద్రాసులో ఒక మీటింగు ఉంది. అక్కడ ఛైర్మన్‌ని, ఎమ్.డి.ని, మిగతా అధికారులను కలిసే అవకాశ ముంటుంది. వారిలో కొందరికి తనంటే ఇష్టమే. ఈసారి వాళ్ళను కలిసేటప్పుడు, తనమీద వాళ్ళకున్న సదభిప్రాయం మరింత పెరగవచ్చు. ఇక పుణ్యక్షేత్రాల విషయానికి వస్తే, మద్రాసుని తలదన్నే మరో నగరం, ఈ భారతమనే ఇండిమాలో ఉందా? అటువంటప్పుడు, ఆటోలో ఎక్కడికయినా వెళుతూ వెళుతూ రోడ్డు పక్కన ఉండే ఇద్దరు ముగ్గురు దేవుళ్లకు ఒక మలేరియా నమస్కారం పారేయడం ఏమంత కష్టం కాదు ఇకపోతే, కుటుంబ జీవితంలో అపోహలు, అపార్థాలు, కలహాలు ఇటువంటివి మామూలే. భార్యామణి అయిన అనసూయా రాణికి, పరపురుషులతో అపోహాలు, కలహాలు కలగడం అసంభవం కాబట్టి, ఆమె తన ఏకైక భర్తతో చీటికి మాటికీ కలహించడంలో తప్పేముంది?

ఇక, మిగిలింది శరీరానికి గాయాలు కానీ, మానహానీ కానీ కలగడం. ఈ జ్యోతిష్యులు ఏవేవో రాస్తారు. వారం మొత్తం మీద బాగానే ఉంటుందన్నప్పుడు, శరీరానికి దెబ్బలుకానీ, మానహానీ కానీ, ఎందుకు కలుగుతాయి? ఒకే రాశిలో, ఒకే నక్షత్రంలో పుట్టినవాళ్ళు, అనేక కోట్లమంది ఈ ప్రపంచంలో ఉంటారు. వాళ్ళందరికి ఒకే వారంలో ఇలా దెబ్బలు కానీ, గాయాలు కానీ తగిలితే, అది డాక్టర్లకు ఒక పండగ వారం అవుతుంది. కానీ, ఇంతమందికి చికిత్స చేయడానికి కావలసిన డాక్టర్లు కానీ, నర్సులు కానీ, హాస్పటల్స్ కానీ

ఉంటాయా? ఏమైనా కానీ, అశుభకార్యాలని పక్కకి నెట్టేసి ఆశావాదాన్ని ఆలింగనం చేసుకోవడమే మంచిది కదా!

ఒక మందుల కంపెనీలో సేల్స్‌మేనేజరు సుశీల్‌రావు. ఒక మోస్తరు జీతము, హౌసెరెంట్ అలవెన్సు, ట్రావెలింగ్ అలవెన్సు అన్నీ లభించడం వలన అర్థికపరమైన ఇబ్బందులేమీ ఆ కుటుంబానికి లేవు. అయినా డబ్బు గురించి, ఏ యింట్లో మాత్రం గొడవలు జరక్కుండా ఉంటాయి? గోద్రెజ్-రిలయన్స్ కుటుంబాల్లో కూడా డబ్బు గురించి భార్యా భర్తల మధ్య చిన్న చిన్న తగాదాలేర్పడటం సహజం. లోకమంతా ఇలా ఉండేటప్పుడు, అనసూయ మాత్రం సుశీల్‌రావుకి తలనొప్పేమీ కలిగించదని చెబితే అతిశయోక్తి కాదు. అభిభాషోక్తి మాత్రమే అవుతుంది.

వారిది ప్రేమ వివాహం. అంటే, పెళ్ళికి ముందు వారికి పరస్పర ప్రేమ ఉండేదన్న మాట. వివాహ పూర్వం ఒక ప్రేమాభ్యర్థిని చిరునవ్వులు, తేనెపలుకులు, వినయం, ప్రేమ ప్రదర్శనలు, ఇవన్నీ చూస్తే రాబోయే ఎన్నికల్లో నిలబడే అభ్యర్థిగా కనిపిస్తుంది. ఎలక్షన్‌లో గెలిచిన తర్వాత, మరో అయిదు సంవత్సరాల దాకా ఎమ్మెల్యేకు ఓటర్లను చూసినప్పుడల్లా కళ్ళకి పొరలు కమ్మినట్టుగా ఉంటుంది. సరిగ్గా అలాగే, కళ్యాణమనే లైసెన్స్ చేతికి చిక్కడంతోనే, నిత్య కళ్యాణి అనే పేరున్న భార్య కూడా భర్త వైపు అధికార పూర్వకంగానే వీక్షిస్తుంది. వివాహానంతరం, ఆ పాత చిరునవ్వులూ, తేనెపలుకుల స్థానంలో సూటిపోటి మాటలు, తాఖీదులు, కన్నెర్ర చెయ్యడాలు చోటుచేసుకుంటాయి. ఒక కొడుకు పుట్టాక, ఆమెకి మంత్రిహోదా లభించినట్టు ఉంటుంది. పిల్లలు ఉన్నత స్థితికి చేరినపుడు, ఆమె సర్వాధికారం గల ఒక ముఖ్యమంత్రిణే అవుతుంది.

సుశీల్‌రావు సతీమణియైన అనసూయారాణిలో ఇటువంటి మార్పులు వచ్చాయని కాదు దీని అర్థం. వివాహానంతరం, అందరి భర్తల్లాగే సుశీల్‌రావులో కూడా భార్యమీద భయభీతులు అనుదినం పెరుగుతూ వచ్చాయి. భార్య అంటే భయమని మీసాలున్న మగవాడు కానీ, మీసాల్లేని మగాడు కానీ ఒప్పుకోవడం కొంతవరకూ ఇబ్బందిగానే ఉంటుంది. కొంతమంది పెద్దపెద్ద పోలీసాఫీసర్ల గురించి చెబుతూ ఉంటారు కదా..... "బాహ్యే వ్యాఘ్రం, గృహే మార్జాలం" అని. అనసూయకి భర్తని ప్రతీదానికి అనుమానించడం అనే విశిష్టగుణం ఒకటి ఉంది. దాని గురించి సుశీల్‌రావు ఏదయినా అంటే, "అవునండీ, అవును. మిమ్మల్ని అనుమానించకుండా ఉండటం నావల్లకాదు. భర్తంటే ప్రేమ ఉన్న ప్రతి స్త్రీ అతన్ని అనుమానిస్తుంది. అతని ప్రతి కదలికనీ గమనిస్తుంది. పొసెసివ్ నేచర్ లేని భార్య ఒక భార్యేనా!" అని ఆమె తనని తాను సమర్థించుకుంటుంది.

చిన్న దానికీ, పెద్ద దానికీ భర్తని తప్పుపట్టడం ద్వారా కార్యదక్షతా పూర్వకమైన నియంత్రణ అతనిపైన సాధించవచ్చుననే ఒక నిస్వార్థపరమైన విశ్వాసం అనసూయకి ఉండేది. కాలేజీలో చదువుతున్న పుత్రరత్నాలు ఇద్దరు ఉండటం వల్ల. తనూ, తన పతిదేవుడు ఎంతో ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఆమె పట్టుదల. దానికోసం, భర్తని తను గీసిన గీత దాటకుండా అంటే..."ఊర్మిళరేఖ" దాటుకుండా ఉంచే సామర్థ్యం ఆమెకు అడవాళ్ళంటే పక్షపాతం ఉన్న ఆ దేవుడు ప్రసాదించాడు.

ఈ వారఫలం విషయాలని మతిమరుపు అనే మూటలో వేసుకుని, బుధవారం చార్మినార్‌లో మన కథానాయకుడు మద్రాసుకు బయలుదేరాడు. గురువారం మీటింగ్ తర్వాత, శుక్రవారం ట్రైనులో తిరుగుప్రయాణం చేయాల్సిన సుశీల్‌రావుని ఎం.డి. కళ్యాణసుందరం పిలిచి. "సుశీల్‌రావ్! నీ ట్రైన్ టిక్కెట్ కాన్సిల్ చేసెయ్. నేను వంటరిగా హైదరాబాదుకు బై రోడ్ వెళ్ళాలని అనుకుంటున్నాను. వంటరిగా కారు ప్రయాణం నాకు చిరాకు. అదో పరమబోర్. అందుకే నీవు కూడా నాతోరా దారిలో తిరుపతి దర్శనం కూడా చేసుకోవచ్చు."

శుక్రవారం ఉదయం వాళ్ళు బయలుదేరారు. ఆ రోజూ, మరుసటి రోజూ సాయంత్రం వరకూ తిరుమలలో ఉండి రెండు సార్లు దైవదర్శనం కూడా చేసుకున్నారు. దర్శనానంతరం, కళ్యాణ సుందరం మెదడులో ఒక మెరుపు మెరిసింది...మూడొంతుల వరకూ నున్నగా అయిపోయిన తన శిఖరాన్ని పూర్తిగా నున్నగా చేయాలని, వంటరిగా, ఒక క్షురకుడి ముందు తలవంచి, కూర్చోవడానికి సిగ్గుపడిన అతను, సమృద్ధకేశుడైన సుశీల్‌రావుని కూడా, రోమసమర్పణానికి ప్రేరేపించాడు. పాపం! సుశీల్..వారఫలంలో చెప్పినట్టుపై అధికారుల ప్రీతికి పాత్రుడు అవుతాడనే ప్రవచనాన్ని సార్థకం చేయడానికి ఒక గుండూ రావుగా మారడానికి సిద్ధపడ్డాడు.

సాయంత్రం తిరుపతిలో బయలుదేరి, రాత్రికి కడపలో ఒక హోటల్‌లో నిద్రపోయారు. తన గురక వల్ల ఎం.డి. సుఖనిద్రకి భంగం కలుగుతుందేమోనని భయపడి, సుశీల్ ఆరాత్రి, ఒక శివరాత్రిలా గడిపాడు.

మర్నాటి ఉదయం, కళ్యాణ సుందరం కారు కర్నూలువైపు రయ్యిమని పయనించింది. మధ్యాహ్నం అక్కడే భోజనం చేసి, కళ్యాణ సుందరం, సుశీల్‌రావు, కారు వెనుక సీట్లో విశ్రమించగా, సారథి కారుని సురక్షితంగా ముందుకు తీసుకువెళ్ళాడు. సాయంత్రం దాదాపు ఆరు గంటలకి హైదరాబాదు బంజారాహిల్స్‌లో ఉన్న ఒక పంచనక్షత్ర హోటల్‌కి చేరారు.

ఎం.డి.అకౌంట్‌లో ఒక కప్పుటీ త్రాగి, సుశీల్‌రావు ఆటోలో అమీర్‌పేట్‌లోని తన యింటికి వెళ్ళే సరికి ఏడున్నర అయింది.

రెండో అంతస్థులో ఉన్న తన యింటి ముందు తలుపు తీసుండటం చూసి, అతను పిల్లిలా ఏమాత్రం శబ్దం చేయకుండా లోపలికెళ్ళాడు. లోపల ఎవరూ కనిపించలేదు. భార్యకి సర్‌ప్రైజ్ ఇద్దామని చెప్పి, అతను మెల్లగా పడకగదిలోకి వెళ్ళి చొక్కా విప్పాడు. బయటెక్కడా లుంగీ కనిపించకపోయేసరికి, అతను స్టీల్ అల్మారా తెరిచాడు.

"అయ్యో దొంగా! దొంగా!" అన్న ఒక స్త్రీ అరుపులు విని, అతను తలుపు వైపు చూసేసరికి, ఆ తలుపులని గట్టిగా లాగి, బయటినుంచి గడియవేసినట్టుగా అర్థమైంది గబగబా పరుగెత్తుకుని వెళ్ళి, తలుపులని బలంగా బాదుతూ, "అనసూయా! అనసూయా! ఇది నేనే...." అని అరిచాడు. గట్టిగా లాగి, బయట నుండి గడియవేయడం, దొంగా! దొంగా! అని ఆమె అరవడం విని, సుశీల్‌రావు గొంతెండిపోయింది.

బయట భయంతో గడగడా వణుకుతున్న అనసూయ, పిల్లలిద్దరినీ, వారి వారి గదుల్లోనే ఉంచి తలుపులు గడియవేసి, ఇరుగు పొరుగు వాళ్ళనికేకేసి, తన యింట్లో దొంగ దూరినట్టు చెప్పగానే, చేతిలో రాళ్ళూ, కర్రలూ, ఖాళీ గోనెసంచులు పట్టుకొని, ఆబాలగోపాలం ఝుమ్మని సుశీల్‌రావు ఫ్లాట్‌లోకి దూసుకెళ్ళారు. దొంగ ఉన్న గదిని వాళ్ళకి చూపించి, అనసూయ పిల్లల గదికి వెళ్ళి లోపల్నుంచి తలుపులేసి, వాళ్ళకి భయపడాల్సిన అవసరమేమీ లేదని చెప్తూ, అక్కడే కూర్చుంది.

ధైర్యం ఉన్న యువకులు కొందరు, ఆ గుంపుకి నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చారు. వాళ్ళల్లో ఇద్దరు ముగ్గురు చేతుల్లో ఖాళీ గోనెసంచులూ, ఒకరిద్దరి చేతుల్లో తాడు, ఇంకొంతమంది చేతుల్లో కర్రలూ ఉన్నాయి. వారిలో పోలీసు అధికారి కావాలని పగటికలలు కంటున్న ఒక యువకుడు, చేతిలో దీపావళి తుపాకీ పట్టుకుని నిలుచున్నాడు.

అనసూయ చెప్పిన ప్రకారం, ఆ దొంగ వంటికంతా నూనె రాసుకున్నాడని, తనని పట్టుకోవడానికి వీల్లేకుండా, గుండు చేయించుకున్నాడని, అందుకే తలుపులు తీసిన వెంటనే అతని తలమీద నుంచి గోనెసంచి ముసుగేసేసి తాడుతో కట్టేయాలని ఈ లోగానే మిగతావాళ్ళు కర్రలతో బాదాలని, ఆ యువకులు పథకం సిద్ధం చేసుకున్నారు. కానీ, అదే సమయములో తాము కొట్టే దెబ్బల వల్ల అతని ప్రాణానికి ముప్పు వాటిల్లితే, కేసు తమ మీదకి వస్తుందనే భయం కూడా వాళ్ళకి లేకపోలేదు.

అనుకున్న ప్రకారం, దొంగ గోనెసంచిలో దూర్చబడ్డాడు. తల మీదనుంచే కాదు. కాళ్ళనుంచి కూడా కర్రలతో అతని కొడుతున్నపుడు, ఆ గోనెసంచిలోంచి, "నేను దొంగని కానుబాబోయ్, నేను సుశీల్‌రావుని, అనసూయ భర్తని." అనే అరుపులు వారికి సరిగ్గా వినిపించలేదు. ఎందుకంటే, ఆ గుంపులో ఉన్న ప్రతీ ఒక్కరూ పెద్దపెద్దగా మాట్లాడుతూ అరుస్తూ ఉన్నారు. ఆ గోనెసంచిలో ఉన్న దుమ్ము ధూళి కారణంగా, లోపలున్న దొంగకి ఆగకుండా వస్తున్న తుమ్ములతో అతని శరీరమంతా కదిలిపోవడం చూసి, అక్కడున్న జనం, ఇతను మామూలు దొంగ కాదని, ఖచ్చితంగా బందిపోటేనని, తప్పించుకుపోవడానికి ప్రయత్నిస్తున్నాడనే అపోహతో అతన్ని బాదడమనే కార్యక్రమాన్ని ఇంకా తీవ్రతరం చేసారు.

ఆ బిల్డింగ్ బయటికి తీసుకువచ్చిన చలనాలున్న గోనెసంచి మూటని చూడ్డానికి చుట్టుపక్కలున్న జనమంతా గుమికూడారు.

ఆ గుంపులో ఎవరయినా దొంగలుంటే మాత్రం, ఆ రోజు వాళ్ళ పంట పండినట్టే. ఏ ఫ్లాటులో నయిననా దొంగతనం చేయవచ్చును.

వాళ్ళల్లో ఎవరో పెద్ద మనిషి పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయడంతో, ఎక్కువ అలస్యం చేయకుండా, ఒక పోలీసు పార్టీ అక్కడికి రావడం జరిగింది. తుపాకీలు ధరించిన పోలీసులు చుట్టూరా నిలబడి, ఆ దోంగ తలమీదనుంచి ముసుగు తొలగించారు. కట్లు విప్పేసినా కూడా, ఆ దొంగ పారిపోయే ప్రయత్నం చేయకుండా, అక్కడే ముక్కుతూ, మూలుగుతూ పడి ఉన్నాడు. ఒక పోలిస్ కానిస్టేబుల్, సబ్-ఇన్స్‌పెక్టర్ చెవి కొరుకుతూ

"సార్! ఇతన్ని చూస్తే పెద్ద గజదొంగలా ఉన్నాడు. ఒక ఎన్‌కౌంటర్ చేసేస్తే?" అని ప్రశ్నించాడు.

"ఓరేయ్ బుద్ధిలేని వెదవా! ఇంతమంది జనం ముందు ఎన్‌కౌంటర్ చేస్తావా? ఇతను ఇక్కడ్నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తే అప్పుడు కాల్చిపడేయడంలో తప్పులేదు." అని ధర్మబోధం గల సబ్-ఇన్స్‌పెక్టర్ జవాబిచ్చాడు.

ఈ లోపల, గుంపులోనుంచి ఒకడు ముందుకు వచ్చి, దొంగ ముఖం మీదికి తొంగి చూసి,

"అయ్యో! ఈయన మన సుశీల్‌రావే కదా! గుండు కొట్టించుకున్నాడు. అందుకే, మనం బోల్తాపడ్డాం" అన్నప్పుడు, చాలామంది దగ్గరికి వచ్చి చూసి, అతనితో ఏకీభవించారు.

కానీ, పోలీసులు అలా వదిలిపెడతారా? అనసూయనీ, పిల్లన్నీ పిలిపించి ఆ చలనరహితుణ్ణి గుర్తు పట్టమని సబ్–ఇన్స్‌పెక్టర్ ఆజ్ఞాపించాడు. ఆ దొంగని పరీక్షగా చూసిన వెంటనే, అతని శరీరం మీదపడి.

"అయ్యయ్యో! ఈయన మా ఆయనే. ఏంత కష్టం వచ్చి పడిందీ, నా వల్ల ఎంతటి పాపం జరిగిపోయింది!" అంటూ, అనసూయ భోరున ఏడ్చింది.

"ఏమ్మా! ఇంకోసారి సరిగ్గా చూసిచెప్పు. ఇతను మీ ఆయన అవునో కాదో! అని సబ్–ఇన్స్‌పెక్టర్ తన అనుమాన నివృత్తికోసం అడిగినప్పుడు.

"అయ్యో! మా ఆయన్ని నేను చీకట్లో కూడా గుర్తుపట్టగలను." అని ఆమె విలాపశైలిలో జవాబిచ్చింది.

"అయితే ఇక్కడున్న లైట్లన్నీ ఆర్పివేయండి." అని అక్కడున్న జనాలనని ఉద్దేశించి వెటకారంగా అన్నాడు. కానీ, అది విని ఎవ్వరూ నవ్వడానికి సిద్ధపడలేదు. దానితో ఆ పోలీస్ అధికారి పెదవుల మీద వెలగబోయిన చిరునవ్వు టక్కున ఫ్యూజ్ అయిపోయింది.

సుశీల్‌రావు పెద్ద కొడుకు అతని దయనీయ స్థితిని ఏడుస్తూ, నిలుచున్నాడు. కానీ, పదహారేళ్ళు వచ్చినా ఇంకా పసితనపు చేష్టలుపోని రెండోకొడుకు అక్కడి పరిస్థితులని గౌరవపూర్వకంగా వీక్షించి.

"అమ్మా! నువ్వెందుకు ఆ దొంగ మీదపడి ఏడుస్తున్నావు? నీకు సిగ్గులేదా?" అని అడిగాడు.

"బాబూ! వీరు మీ నాన్నగారే!" అని అనసూయ, కొడుక్కి బోధపరచడానికి ప్రయత్నం చేసింది.

"ఇతను మా నాన్నకాదు. మా నాన్నకి తలనిండా జుట్టుంది." అని ఆ అబ్బాయి ఖచ్చితంగా చెప్పాడు.

స్పృహ పూర్తిగా కోల్పోని సుశీల్‌రావు పెదవులు నెమ్మదిగా కదిలాయి. ఆదివారం మధ్యాహ్నం దూరదర్శన్‌లో బధిరుల కోసం ప్రసారంచేసే వార్తలని క్రమం తప్పకుండా చేసేవాడెవడయినా, ఆ సమయంలో సుశీల్‌రావు అధర చలనాలని వీక్షిస్తే. అవి, "తిరుపతి! తిరుపతి!" అనే పదద్వయానికి దృశ్యావిష్కరణమని తెలుసు కుంటారేమో.

తన జీవితంలో మొదటిసారిగా, తనకోసం కన్నీరు కారుస్తూ, విలపిస్తున్న ప్రాణప్రేయసి తనని గుండెలకి హత్తుకోవడం, సుశీల్‌రావు మనసుకి పులకరింత కలిగిస్తుందేమో కానీ,

శరీర మాసాంతం గాయాలపై గాయాలు తగిలిన కారణం వల్ల, అందమైన ఒక సీతాకోకచిలుక వచ్చి, దాన్ని స్పృశించినా కూడా, అసహనీయమైన వేదన కలిగే ఆ పరిస్థితిలో ప్రేమప్రదర్శనలు ఒక రెండు మూడు నెలలు వాయిదా పడితే బాగుంటుందని అతను అనుకోవడం ఎంతో మానవసహజం. తన సహధర్మచారిణి భారంతోపాటు ఆమె శోకప్రకటన చలనాలు, సుశీల్‌రావుకి నరకయాతన అంటే ఏమిటో పరిచయం చేశాయి. అలాగని, ఆమెని పక్కకి నెట్టేయడానికి అతని చేతులలో శక్తిలేదు. కన్నీరు కారుస్తూ, పళ్ళు కొరుకుతూ, అతను ఆ దుస్సహ వేదన ఎలాగో భరించాడు.

"మీరు ఇతన్ని ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేర్పించండి. గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకువెళ్తే పోలీసు కేసవుతుంది." అనే హెచ్చరిక పారేసి, ఆ సబ్-ఇన్స్‌పెక్టర్ తన కింకరులతో పాటు అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

కానీ, అలా వెళ్ళిపోయేముందు, అతను అనసూయని కొద్దిగా హేళనచేయడం మాత్రం మరిచిపోలేదు.

"చూడండమ్మగారు! ఈ రోజుల్లో సాధారణంగా మామూలు ఆడవాళ్ళు మొగుడితో ఏదయినా గొడవ జరిగితే, పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంటిస్తారు. కానీ, ఇదేమిటి? ఇది మహాఘోరంగా ఉంది. మీ వంటి పతివ్రతెవరైనా, తప్పుచేసిన మొగుడిని పరాయివాళ్ళతో ఇలా కొట్టిసారా? మీ ఆయన ఇక, రెండు మూడు నెలలపాటు ఆసుపత్రిలో పడి ఉండాల్సివస్తుంది. ఫరవాలేదు, ఆ లోపల, ఇతని తలమీద దట్టంగా జుట్టు పెరుగుతుందేమో!